సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



తెలంగాణ మద్యం స్వాధీనం
కుక్కునూరు మండలం వేలేరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



తలమానికం ఫిషింగ్ హార్బర్
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి తలమానికంగా నరసాపురంలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం నిలవనుంది. 8లో ▸



పెళ్లింట్లో భారీ చోరీ
కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామంలో పెళ్లింట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

గడువులోపు అర్జీల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురాజు

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూసుకోవాలని, ప్రతి అర్జీని అత్యంత బాధ్యతతో పరిశీలించాలన్నారు. స్పందనలో 177 అర్జీలను స్వీకరించామన్నారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ అప్పిలేట్ సభ్యుడు మేళం దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

స్పందనలో 18 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అజిత

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.అజిత, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. పలు అర్జీల పరిష్కారానికి రిఫర్ చేశారు. సివిల్ కేసులను కోర్టులో తేల్చుకోవాలని జిల్లా ఎస్పీ అజిత సూచించారు. మొత్తం 18 అర్జీలు అందాయని డీఎస్పీ మూర్తి తెలిపారు. పట్టణ, రూరల్ సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆమె తాడేపల్లిగూడెం రూరల్, టౌన్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు.

నేడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాక

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం జిల్లాకు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ ప్రకటనలో తెలిపింది. ఆమె ఉదయం 9.30 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు పెనుగొండ చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 12.45 గంటల వరకు పెనుగొండలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు నరసాపురం మున్సిపల్ అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.45 వరకు పీఎం లంకలోని డిజిటల్ కమ్యూనిటీ సెంటర్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు పీఎం లంక నుంచి బయలుదేరి విజయవాడ వెళతారు.

అమ్మవారికి సువర్ణ కిరీటం అలంకరణ
పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలోని 90 అడుగుల వాసవీ కన్యకపరమేశ్వరి పంచలోహ విగ్రహ పంచమ వార్షికోత్సవాల్లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు నూతన సువర్ణ కిరీటం అలంకరించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు తెలిపారు. సువర్ణ కిరీటం తయారీకి బొండాడ రాంపండు, రాజేంద్ర ప్రసాద్, సెంథిల్‌తో పాటు సింగపూర్‌లోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు సహకరించారన్నారు. మంగళవారం జరిగే కార్యక్రమాలకు మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, శిద్దా రాఘవరావు, వెల్లంపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నారని తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు 29 వరకు గడువు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు (పెన్షనర్స్ వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్లు) సమర్పించడానికి ఈనెల 29 ఆఖరి తేదీ అని ఏలూరు జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి టి.కృష్ణ తెలిపారు. ప్రతిఒక్క పెన్షనర్ తమ దగ్గరలోని ఉప ఖజానా కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో లేదా పోస్టాఫీసుల్లో లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలని లేకుంటే మార్చి నెల పెన్షన్ నిలిపివేస్తారన్నారు. ఖజానా కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించామని, కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీలో కూడా లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయవచ్చన్నారు. ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లతోపాటు నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు.

పేదింటి పెళ్లికి ప్రభుత్వ సాయం

కళ్యాణమస్తు.. షాదీతోఫా
- నేడు ఐదో విడత సాయం అందజేత
- జిల్లాలో 411 మంది లబ్ధిదారులకు రూ.2.84 కోట్ల ప్రయోజనం
- ఇప్పటివరకు రూ.13.79 కోట్ల సాయం

భీమవరం(ప్రకాశం చౌక్): పేదింటి పెళ్లికి ప్రభుత్వం పెద్ద సాయం అందిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు భారం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు–వైఎస్సార్ షాదీతోఫా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల పిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు విడతలుగా పథకాన్ని అమలు చేయగా మంగళవారం ఐదో విడత లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమచేయనున్నారు. ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వం ఈ పథకం ద్వారా పేదలకు బాసటగా నిలుస్తోంది. సామాజిక వర్గాల వారీగా రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు సాయం అందిస్తోంది.

అంతటా హర్షం : సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి కళ్యాణమస్తు–షాదీతోఫా పథకాన్ని అమలు చేయడంపై అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ పెద్ద కొడుకులా ఆడబిడ్డల వివాహాలకు ఆదుకుంటున్న జగనన్న సేవలను అంతటా కొనియాడుతున్నారు. గతంలో పిల్లల పెళ్లికి అప్పులు చేయాల్సి వచ్చేదని సీఎం జగన్ పాలనలో ఈ బాధలు తప్పాయని సంతోషంగా చెబుతున్నారు. ఐదో విడతలో పశ్చిమగోదావరి జిల్లాలో 411 మందికి రూ.2.84 కోట్ల మేర లబ్ధి చేకూర్చనున్నారు.

2,364 మంది.. రూ.16.63 కోట్లు
పశ్చిమగోదావరి జిల్లాలో కళ్యాణమస్తు–షాదీతోఫా పథకం కింద ఐదు విడతల్లో మొత్తంగా 2,364 మందికి ప్రభుత్వం రూ.16.63 కోట్ల లబ్ధి చేకూర్చింది. ఎస్సీలు 615 మందికి రూ.6.15 కోట్లు, ఎస్టీలు ఏడుగురికి రూ.7 లక్షలు, బీసీలు 1,406 మందికి రూ.7.03 కోట్లు, దివ్యాంగులు 34 మందికి రూ.51 లక్షలు, మైనార్టీలు 31 మందికి రూ.31 లక్షలు, బీసీ కులాంతర వివాహం 136 మందికి రూ.1.20 కోట్లు, ఎస్సీలు కులాంతర వివాహం 80 మందికి రూ.96 లక్షలు, ఎస్టీలు 15 మందికి రూ.15 లక్షలు, ఎస్టీలు కులాంతర వివాహం ముగ్గురికి రూ.3.60 లక్షలు, భవన నిర్మాణ కార్మికులు 44 మందికి రూ.17.60 లక్షల చొప్పున లబ్ధి పొందారు.



భీమవరంలో కళ్యాణమస్తు-షాదీతోఫా లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

సామాజిక వర్గాల వారీగా పథకం లబ్ధి

ఎస్సీ, ఎస్టీలకు రూ. 1,00,000	బీసీలకు రూ. 50,000	మైనార్టీలకు రూ. 1,00,000
ఎస్సీ, ఎస్టీలకు కులాంతర వివాహం రూ. 1,20,000	బీసీలు కులాంతర వివాహం రూ. 75,000	ఓసీలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ. 40,000
దివ్యాంగులకు రూ. 1,50,000		

ఐదో విడత లబ్ధిదారులు

మండలం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.లక్షలలో)
ఆచంట	15	11.00
ఆకివీడు	14	11.35
అత్తిలి	14	9.75
భీమవరం	35	25.00
యలమంచిలి	22	17.65
గణపవరం	12	7.60
ఇరగవరం	17	11.20
కాళ్ల	13	8.25
మొగల్తూరు	22	12.50
నరసాపురం	32	18.75
పాలకోడేరు	16	11.75
పాలకొల్లు	34	23.40
పెంటపాడు	17	12.40
పెనుగొండ	23	17.00
పెనుమంట్ర	20	14.60
పోడూరు	15	10.95
తణుకు	18	11.25
ఉండి	14	8.70
వీరవాసరం	27	16.40
తాడేపల్లిగూడెం	31	24.50

రూ.లక్ష సాయం అందింది



నాకు గతేడాది జనవరిలో వివాహం కాగా కళ్యాణమస్తుకు దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం రూ.లక్ష సాయం అందించింది. జగనన్న ఆర్థిక సాయంతో మా కుటుంబాన్ని ఆదుకున్నారు. ఈ మేలు మా కుటుంబానికి భరోసాగా నిలిచింది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు భారం. దీనిని తగ్గించేలా కళ్యాణమస్తు పథకం అమలుతీరు బాగుంది. – ఎస్.భూమిక, పాలకొల్లు

సద్వినియోగం చేసుకోవాలి



కళ్యాణమస్తు–షాదీతోఫా పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో నాలుగు విడతల్లో రూ.13.79 కోట్ల సాయం ప్రభుత్వం అందించింది. ఐదో విడతలో రూ.2.84 కోట్లు అందించనుంది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించి వివాహపత్రాలు, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తదితర వాటిని సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చు. – ఎంఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ

గరివికొండలో పులి సంచారం



మొక్కజొన్న తోటలో పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

పోలవరం రూరల్: మండలంలోని ప్రగడపల్లి పంచాయతీ పరిధిలోని గుంజవరం గ్రామ సమీపంలోని గరివికొండ ప్రాంతంలో సోమవారం వేకువజామున పులి సంచరించింది. ఉదయం మొక్కజొన్న చేలల్లో తడి పెట్టేందుకు వెళ్లిన రైతులు పులి సంచరించిన ప్రాంతాల్లో వాటి పాదముద్రలను గుర్తించారు. దీనిపై అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ సిబ్బంది మొక్కజొన్న చేలు, గరివికొండ ప్రాంతంలో పరిశీలించి పులి సంచరించినట్టు అడుగుజాడలను గుర్తించారు. సుమారు 17 సెం.మీ పొడవు, 15 సెం.మీ వెడల్పుతో పాదముద్రలను అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. మొక్కజొన్న చేలో సంచరించిన పులి తిరిగి కొండపైకి వెళ్లినట్టుగా భావిస్తున్నారు. గ్రామస్తులు రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లవద్దని, ఒంటరిగా కొండ ప్రాంతాల్లో తిరగవద్దని అధికారులు హెచ్చరించారు.



పులి పాదముద్రలను కొలుస్తున్న దృశ్యం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు



దిగమర్రు హైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న కొవ్వూరి వేణుమాధవరెడ్డి

పాలకొల్లు అర్బన్: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి అన్నారు. మండలంలోని దిగమర్రు, పూలపల్లి జెడ్పీ హైస్కూళ్లలో జరుగుతున్న నాడు–నేడు పనులను సోమవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యాబోధన, గోరుముద్ద అమలు తీరు, నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, మరుగుదొడ్ల నిర్వాహణ తదితర అంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు–నేడులో మొదటి విడతలో రూ.100.15 కోట్లతో 483 పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. రెండో విడతలో రూ.248.82 కోట్లతో 716 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని, వీటిలో 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట మన్యం జగ్గమ్మగారి సత్రం చైర్మన్ నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, హెచ్‌ఎంలు శ్రీనివాస్, జీటీవీ కుమార్ ఉన్నారు.

వలంటీర్ల సేవలు అజరామరం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు అజరామరమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. వలంటీర్లకు పురస్కారాల ప్రదానం కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని బలుసులమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ కరోనా విపత్తు సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వలంటీర్లు విశేష సేవలందించారన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖున వేకువజాము నుంచే వలంటీర్లు పింఛన్లు అందించడం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం జగన్ మానసపుత్రిక అయిన వలంటీర్ వ్యవస్థ గురించి దేశమంతా మాట్లాడుకుంటోందన్నారు. ఆలయాల్లో సేవకుల మాదిరిగా వలంటీర్లు కూడా ప్రభుత్వం తరఫున ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తూ మన్ననలు పొందుతున్నారన్నారు. వలంటీర్ల గురించి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు.



తాడేపల్లిగూడెంలో సభకు హాజరైన వలంటీర్లు



వలంటీర్లకు చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

వలంటీర్లు అంటే ఎక్కడి నుంచో వచ్చి పడలేదని మన ఇరుగుపొరుగు వారేనన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు.

దేశమంతా అధ్యయనం
వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై దేశంలోని పలు రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని మంత్రి కొట్టు అన్నారు. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ వీటిని దేశమంతా అమలు చేయాలని కేంద్రానికి సూచించడం గర్వకారణమన్నారు. వయసులో చిన్నవారైనా వలంటీర్లు అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. వలంటీర్ వ్యవస్థకు భవిష్యత్తులో మరింత వైభవం వస్తుందన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర పురస్కారాలను అందించి శాలువాతో సత్కరించి మెడల్, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరించారు. నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, గుండు మోగుల సాంబయ్య, భావన ధాన్యలక్ష్మి, ఎంపీపీ పానుకుమాటి శేషులత, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, సూర్పని రామకృష్ణ, బొద్దాని శ్రీనివాస్, ఎంపీడీఓ శర్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు కలెక్టర్‌గా సేవలందించిన పి.ప్రశాంతి రెండు రోజుల క్రితం బాధ్యతల నుంచి రిలీవ్ కాగా జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి ఇన్‌చార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సాధారణ బదిలీల్లో భాగంగా..
సాధారణ బదిలీల్లో భాగంగా కలెక్టర్ ప్రశాంతిని అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా, అల్లూరు సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత్‌కుమార్‌గాంధీని 'పశ్చిమ' కలెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 14న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. పునర్విభజన అనంతరం జిల్లాకు సుమిత్‌కుమార్ రెండో కలెక్టర్ కాగా, కలెక్టర్‌గా ఆయనకు ఇది రెండో పోస్టింగ్ కావడం గమనార్హం. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు రోజుల క్రితం పూర్వపు కలెక్టర్ ప్రశాంతి రిలీవ్

జిల్లాలో పనిచేసిన అనుభవం
కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. సివిల్స్‌కు ప్రిపేరై 2014లో ఐఏఎస్‌కు ఎంపికైన ఆయన ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసిన అనంతరం నరసాపురం రెవెన్యూ సబ్ డివిజన్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. నరసాపురం, పాలకొల్లు, ఆచంట, భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో సేవలందించారు. రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి వ్యవహారాలు దరిచేరనివ్వని అధికారిగా గుర్తింపు పొందారు. కిందిస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడేందుకు ఆస్కారం లేకుండా కంప్లయింట్ బాక్సులు ఏర్పాటుచేయడం తదితర పాలనపరంగా సంస్కరణలు తీసుకురావడం ద్వారా ప్రజల మన్ననలు పొందారు.

ఎన్నికల విధులే కీలకం
మరికొద్ది రోజుల్లో సార్వత్రిక సమరానికి తెరలేవనుంది. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం కావడంతో పాటు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. గతంలో ఇక్కడ సేవలందించిన అనుభవంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుంటుంది.

వాసవీ మాత.. ఆరాధ్య దేవత



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో అమ్మవారు

పెనుగొండ: ఆరు రాష్ట్రాలు.. 75 ఆలయాల్లో కొలువైన వాసవీ మాత ప్రతిమలు ఒకే చోట చేరితే ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుంది. ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ మాత పుట్టిల్లు పెనుగొండ క్షేత్రంలో ఈ వేడుక కనుల పండువగా జరిగింది. అఖిల భారత్ శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో పెనుగొండ వాసవీ శాంతి ధాంలో 90 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహ పంచమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు వినూత్న ఆలోచనతో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని 75 ఆలయాల్లో పూజలందుకుంటున్న వాసవీ మాత ఉత్సవ విగ్రహాలను ఇక్కడకు తీసుకువచ్చి ప్రత్యేకంగా స్టాల్స్‌గా ప్రదర్శించారు. సోమవారం వేకువజామున శాంతి ధాంలోని పుష్కరిణి వద్ద జలాభిషేకం చేసి రుషిగోత్ర సువర్ణ మందిరంలో తీర్చిదిద్దిన ఉపాలయాల్లో వాసవీ మాత ప్రతిమలను అలంకరించారు. తెనాలికి చెందిన ప్రజ్ఞానంద సరస్వతీ స్టాల్స్‌ను ప్రారంభించారు. గోవిందరాజులు మాట్లాడుతూ పెనుగొండ క్షేత్రాన్ని అత్యంత శక్తివంతమైన పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ, కార్యదర్శి ఎస్.సతీష్, కోశాధికారి ఎస్ఎస్ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.







హిందూపురం, కర్ణాటక, అనంతపురం నుంచి తీసుకువచ్చిన అమ్మవారి ఉత్సవమూర్తులు

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన ఏలూరు విద్యార్థిని



రజత పతకం సాధించిన ఏఆర్‌డీజీకే విద్యార్థిని రెడ్డి భవాని

ఏలూరు టౌన్: నగరంలోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలకోన్నత పాఠశాల విద్యార్థిని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటింది. పాట్నాలో నిర్వహించిన 67వ జాతీయ పాఠశాలల క్రీడోత్సవాల్లో ఏలూరు విద్యార్థిని 45 కిలోల వెయిట్ లిఫ్టింగ్ బాలికల విభాగంలో రజత పతకం సాధించింది. ఏఆర్‌డీజీకే స్కూల్లో 9వ తరగతి చదువుతున్న రెడ్డి భవాని గతంలోనూ అనేక పతకాలు సాధించి ప్రతిభను నిరూపించుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఓఎస్ ఉజ్వల చెప్పారు. పాఠశాల పేరును జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చేలా చేసిన విద్యార్థిని రెడ్డి భవానిని పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఉపాధ్యాయులు వి.క్రాంతికుమార్ మాట్లాడుతూ రెడ్డి భవాని ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జూనియర్ యూత్ నేషనల్స్‌లో, తమిళనాడులో జరిగిన ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌లోనూ రజత పతకాలు సాధించిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.పుల్లారావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

పశ్చిమకే తలమానికం.. ఫిషింగ్ హార్బర్

- సాకారం కానున్న దశాబ్దాల నాటి కల
- బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్
- ఇప్పటికే పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- పనులు దక్కించుకున్న 'విశ్వసముద్ర'
- రూ.429.43 కోట్లతో త్వరలో పనులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి గీటురాయిగా నరసాపురంలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం నిలవనుంది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే. ఈ హార్బర్ నిర్మాణానికి గత ఏడాది మేలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు కూడా ఇటీవల లభించాయి. మరికొద్ది రోజుల్లో హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరప్రాంతం విస్తరించి ఉంది. నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఈ ప్రాంతంలో 5 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. కానీ మత్స్యకారుల సంక్షేమంపై గత టీడీపీ ప్రభుత్వం దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బియ్యపుతిప్ప హార్బర్ సమస్య అలాగే ఉండిపోయింది. మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక కొత్తగా ఏర్పడ్డ డెల్టా ప్రాంతంతో కూడిన ప్రాంతం నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగుతుంటాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడంతో ఆక్వారంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమా అని జిల్లాకు వస్తోంది. ఇటు తీరప్రాంతంలో సముద్ర మత్స్యసంపద ద్వారా కూడా భారీగా ఆదాయం సమకూరుతోంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు జరుగుతుంటాయి. హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే ఈ ఎగుమతులు మరో 40 శాతం పెరిగే అవకాశం ఉంది. ఆక్వారంగంలో ఈ సవాళ్లను ఎదుర్కోవాలనే లక్ష్యంతోనే ఇప్పటికే నరసాపురంలో ఫిషరీస్ రియూనివర్సిటీని జగన్ సర్కారు ఏర్పాటు చేసింది.



హార్బర్ లేకపోవడంతో పట్టణంలోని వశిష్ట గోదావరి గట్టున నిలిపిన వేట బోట్లు



బియ్యపుతిప్పలో నిర్మించే హార్బర్ డిజైన్



హార్బర్ లేకపోవడంతో సముద్రం నుంచి వేట బోటును మోసుకొస్తున్న మత్స్యకారులు

600 ఎకరాల విస్తీర్ణంలో..

బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థలసేకరణ 2022లోనే పూర్తి చేశారు. హార్బర్ డిజైన్ కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక దృష్టి పెట్టి తయారు చేయించారు. సుమారు 300 బోట్లు నిలిచేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు. సముద్రంలో లభ్యమైన సరుకును ఏక కాలంలో 500 టన్నుల మత్స్య ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించనున్నారు. ఇక తుపాను వంటి ప్రకృతి విపత్తుల సమయంలో వేట సాగించే మత్స్యకారుల రక్షణకు సంబంధించి సామగ్రి హార్బర్‌లో అందుబాటులో ఉంటాయి. 216 జాతీయ రహదారి అభివృద్ధి పనులు పూర్తవడంతో తీరం నుంచి రవాణా సౌకర్యం కూడా మెరుగైంది. ఇప్పుడు తీరంలో హార్బర్ రానుండటంతో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు మహర్దశ పట్టనుంది. హార్బర్ కమ్ కార్గో పోర్ట్ నిర్మాణం చేపడుతుండటంతో ఇతర జిల్లాల నుంచి కూడా ఎగుమతులు జరిగే అవకాశం ఉంటుంది.

హార్బర్ విషయంలో టీడీపీ డ్రామాలు..

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ బియ్యపుతిప్ప హార్బర్ విషయంలో అనేక డ్రామాలు కొనసాగించింది. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న మత్స్యకారులను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిన టీడీపీ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కడుతున్నామంటూ మోసగిస్తూ వచ్చింది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ లోకేష్‌ను తీసుకువచ్చి హడావిడిగా రూ.13 కోట్ల వ్యయంతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయించారు. అయితే 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రూ.13 కోట్ల వ్యయాన్ని రూ.20 కోట్లకు పెంచి అంచనాలు తయారు చేయించారు. మళ్లీ స్థానికంగా మేజర్ ఫిషింగ్ హార్బర్ అవసరాన్ని గుర్తించి హార్బర్ కమ్ కార్గోపోర్ట్ నిర్మాణానికి రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో పూనుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే..



బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో శంకుస్థాపన జరిగింది. నిజానికి కేంద్రం ఇక్కడ హార్బర్ నిర్మాణానికి ఒప్పుకోలేదు. కానీ ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చామని చెప్పి ముఖ్యమంత్రి నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి పూనుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే హార్బర్ నిర్మాణం చేసేలా స్వయంగా సీఎం శంకుస్థాపన చేశారు. పనులు పూర్తి చేయడానికి విశ్వసముద్ర సంస్థ టెండర్లు దక్కించుకుంది. ప్రతిపక్షాలు హార్బర్ నిర్మాణంపై రాద్ధాంతం చేస్తున్నాయి. ఖచ్చితంగా బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగి తీరుతుంది. కొత్త జిల్లా పశ్చిమగోదావరి అభివృద్ధిపై హార్బర్ నిర్మాణ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

చాట్రాయి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మర్లపాలెం గ్రామానికి చెందిన పెదగమళ్ల సునీంద్రరావు (30) కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి కొత్తగా నిర్మిస్తున్న గోడను తడుపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతనిని ప్రైవేట్ వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి ఇంట్లో భారీ చోరీ

- బయ్యనగూడెంలో ఇంటికి తాళం వేసి వివాహానికి హాజరు
- రూ.4 లక్షల నగదు, నాలుగున్నర కాసుల బంగారం అపహరణ
- సీసీ టీవీ ఫుటేజీలో రికార్డ్ అయిన దొంగతనం దృశ్యాలు

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో ఓ పెళ్లి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగి రూ.4 లక్షల నగదు, నాలుగున్న కాసుల బంగారం అపహరణకు గురైంది. పెళ్లి పనులకు తెచ్చి పెట్టుకున్న నగదు చోరీకి గురికావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాధవరపు వరదరావు కుమార్తె వివాహం ఆదివారం రాత్రి గ్రామంలోనే ఓ కల్యాణ మండపంలో జరిగింది. కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళాలు వేసుకుని, వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం తెల్లవారుజామున ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఆందోళనకు గురై లోనికి వెళ్లి చూడగా తెరిచి ఉన్న బీరువాలో నగదు, నగలు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం ఎస్సై విష్ణువర్ధన్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఇంట్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలో దొంగతనం జరిగిన దృశ్యాలు నమోదయ్యాయి. దుండగుడు ఇంట్లోకి ప్రవేశించటం, తాళాలు పగలగొట్టడం, నగదు అపహరించడం వరకు అన్నీ దృశ్యాలు రికార్డయ్యాయి. అనంతరం పోలవరం డీఎస్పీ సురేష్ కుమార్‌రెడ్డి, సీఐ మధుబాబు చోరీ జరిగిన ఇంటికి వచ్చి, సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి 11 నుంచి 12 గంటల సమయంలో దొంగతనం జరిగిందని, రూ.4 లక్షల నగదు, నాలుగున్నర కాసుల బంగారం చోరీకి గురయ్యాయని, త్వరలోనే నిందితుడిని పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేస్తామని పోలీసులు చెప్పారు.



చోరీ జరిగిన ప్రదేశంలో వివరాలను సేకరిస్తున్న పోలీసులు



సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడు

శ్రీవారి సేవలో ఎమ్మెల్యేలు పేర్ని గ్రంధి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఇద్దరు ఎమ్మెల్యేలు సందర్శించారు. మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని సతీసమేతంగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అలాగే సోమవారం ఉదయం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శ్రీవారిని దర్శించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన వీరికి అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అలాగే స్వామివారి జ్ఞాపికలను అందజేశారు.



శ్రీవారి ఆలయంలో సతీసమేతంగా పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

బియ్యం లారీ సీజ్

ఉంగుటూరు: ఎటువంటి అనుమతులు లేకుండా లారీలో రవాణా చేస్తున్న 20 టన్నుల బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టివేశారు. వివరాలిలా ఉన్నాయి. చేబ్రోలు ఎస్సై మణికుమార్‌కు అందిన సమాచారం మేరకు ఉంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో అడ్డగించి బియ్యం లోడు లారీని స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు నుంచి ఉండ్రాజవరానికి బియ్యం తరలిస్తున్నారని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు తూర్పుతాళ్లు విద్యార్థులు

నరసాపురం రూరల్: తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17న తణుకులో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్‌జీఎస్ఎన్ మణికంఠసాయి, గుత్తుల ధనశ్రీ ప్రతిభ చూపి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో వీరు జిల్లా జట్టు తరుపున ఆడనున్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను, వారికి శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అడపా రామకృష్ణను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి ముత్యాలరావు అభినందించారు.



ఎన్‌జీఎస్ఎన్ మణికంఠసాయి



గుత్తుల ధనశ్రీ

తణుకులో తిరుమల విద్యా సంస్థలు

తణుకు టౌన్: విలువలతో కూడిన విద్యనందించేందుకు తిరుమల విద్యా సంస్థలు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఎస్.తిరుమలరావు చెప్పారు. సోమవారం తణుకులోని మెయిన్ రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పైన తిరుమల విద్యా సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. తిరుమల విద్యా సంస్థలను మొదటిగా రాజమహేంద్రవరంలో ప్రారంభించామని, అనంతరం విశాఖపట్టణం, భీమవరం, పాయకరావుపేట, ప్రస్తుతం తణుకు పట్టణంలో తమ విద్యా సంస్థ బ్రాంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెంలోని పూర్వ విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు తణుకు పట్టణంలోని ఇరగవరం రోడ్డులో గల కొమరవరం గ్రామం వద్ద తమ కాంపస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి, జూనియర్ ఇంటర్ డేస్కాలర్‌గా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపస్‌లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ సున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జీ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యూ శ్రీహరి, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



తణుకులో అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్.తిరుమలరావు, డైరెక్టర్లు

తెలంగాణ మద్యం స్వాధీనం

కుక్కునూరు: మండలంలోని వేలేరు అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలలో ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు కుక్కునూరు సీఐ శ్రీనివాస్ సోమవారం చెప్పారు. ఆదివారం వేలేరు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై 350 క్వార్టర్ మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. సోమవారం నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులతో కుక్కునూరు పోలీసులు

క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఉరదాళ్లపాలెంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

అత్తిలి: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి భీమవరం వారి ఆధ్వర్యంలో సోమవారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో మిరియాల బాబూరావు కళాజాత బృందం హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వీధి నాటకాన్ని ప్రదర్శించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పట్ల అవగాహన, ఐసీటీసీ సెంటర్ ఆవశ్యకత, ఏఆర్టీ మందుల ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నంబర్ 1097 గురించి ప్రజలకు ఆట, పాటల ద్వారా వివరించారు.

22న అలంపురంలో ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: ఈనెల 22న మండలంలోని అలంపురం గ్రామంలో వెంకటరమణ సేవా ట్రస్టు ఆస్పత్రిలో ఉచిత మోగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, అంకాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వైద్యనిపుణులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు ఈసీజీ, 2డి ఈకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైకల్యం చదువుకు అడ్డంకి కాదు



భవిత సెంటర్‌కు ఫ్యాన్ బహుకరిస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైకల్యం చదువుకు అడ్డంకి కాదని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య అన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రంలో సోమవారం దాతలు చిట్టిమణి మీనాక్షి, నాగు, నరసింహారాజు, పి.వీరబాబులచే భవిత సెంటర్‌కు ఫ్యాన్ బహుకరణ, పండ్లు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, చంద్రకుమారి, జ్యోతి, రాజు, ప్రసాద్, అయ్యప్ప, దివ్యాంగుల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



వెంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న నిర్వాహకులు

పెంటపాడు: మండలంలోని పడమర విప్పర్రు గ్రామంలో సోమవారం వెంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో రూ.10లక్షలను వాణి ట్రస్టు ద్వారా అందజేశారు. ఈ ఆయల నిర్మాణం పూర్తి అయ్యేందుకు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు బోణం వీరయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. స్థలదాత బోణం శేషగిరిరావు స్థలంలో ఈ ఆలయాన్ని నిర్మించేందుకు అర్చకులు కొడవటిగంటి లక్ష్మణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత కొట్టు విశాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కోసూరి వెంకటరాజు, ప్రస్తుత అధ్యక్షుడు కసిరెడ్డి అబ్బాయి, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, ఎంపీటీసీ యండ సరస్వతీ, పసల చంటి,శ్రీకృష్ణ, కళింగ కార్పొరేషణ డైరెక్టర్ సంపతిరావు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఉపాధ్యాయులు విద్యార్థుల్లో లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమగ్ర శిక్ష అదనపు సమన్వకర్త పి.శ్యామ్‌సుందర్ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్ సమావేశాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ ఎ.రామకోటేశ్వరరావు, ఎంఈవో వేంద్ర వెంకటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం ఎంజే సుధారాణి పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులు

- నియోజకవర్గంలో 2 విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు
- విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యుత్ వినియోగదారులు
- తణుకు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా అభివృద్ధి, సంక్షేమానికి రూ. 125.69 కోట్లు



తణుకు పైడిపర్రులో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులతో మంత్రి కారుమూరి. (ఫైల్)

తణుకు అర్బన్: విద్యుత్ శాఖలో నూతనంగా ఆవిష్కరింపబడిన విధివిధానాలకు అనుగుణంగా ఆ శాఖ అందిస్తున్న సేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖ పనితీరులో ఎన్నో నూతన ఆవిష్కరణలు తోడయ్యాయి. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ శాఖ నుంచి నిరంతర నాణ్యమైన విద్యుత్ సేవలు అందించే విధంగా ప్రణాళికాబద్ధంగా నడుస్తోంది. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యతోపాటు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏర్పడే ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సైతం తీవ్రంగా శ్రమించి ఆ శాఖ పనితీరును గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు రూ. 125.69 కోట్లు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో విద్యుత్ సరఫరాతోపాటు విద్యుత్ పరికరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 2019 నుంచి 2023 వరకు రూ.125.69 కోట్లు నిధులు వెచ్చించారు. ఇందులో విద్యుత్ లైన్స్, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్, విద్యుత్ సబ్ స్టేషన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతుల పనులకు సంబంధించి రూ. 30.75కోట్లు వెచ్చించగా, మరొక రూ. 26.76 కోట్లు పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. సంక్షేమంలో భాగంగా అత్యధికంగా ఆక్వా, ఎస్సీ, ఎస్టీ, అగ్రికల్చర్ రంగాలకు సంబంధించి రైతాంగానికి ఇప్పటివరకు రూ. 68.18 కోట్లు విద్యుత్ రాయితీలుగా ఇచ్చారు. ముఖ్యంగా తణుకులో రూ. 5.67 కోట్లతో రెండు సబ్ స్టేషన్‌లు నిర్మాణాలు చేయగా అత్తిలి, ఇరగవరం మండలాల్లో మరొక రెండు సబ్ స్టేషన్స్ మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో రూ. 2.62 కోట్లతో 212 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఇప్పటికే ఏర్పాటు చేయగా, రూ. 11.16 కోట్లుతో మరొ 321 ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయనున్నారు.



పైడిపర్రులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్

తణుకు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ పనులు

విద్యుత్ కనెక్షన్స్ ద్వారా సంక్షేమం..

ఆక్వా సబ్సిడీ – 637 సర్వీసులు.రూ. 53.60 కోట్లు.
ఎస్‌సీ సబ్సిడీ – 5680 సర్వీసులు, రూ. 11.24 కోట్లు.
ఎస్టీ సబ్సిడీ – 208 సర్వీసులు, రూ. 33.67 లక్షలు.
అగ్రికల్చర్ సబ్సిడీ – 301 సర్వీసులు, రూ. 2.99 కోట్లు.

విద్యుత్ శాఖ అభివృద్ధి పనులు

కొత్త సబ్ స్టేషన్లు – 2, రూ. 5.67 కోట్లు.
పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపుదల రూ. 1.53 కోట్లు.
అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్. రూ. 58.88 లక్షలు.
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఇనస్టలేషన్ – 212, రూ. 2.62 కోట్లు.
11కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్ – 2.3కిలోమీటర్లు, రూ.10.90 లక్షలు.
కండక్టర్స్/ఎల్టీ ఏబీ కేబుల్‌మార్పు – 58 ప్రాంతాలు, రూ. 83.51 లక్షలు.
విద్యుత్ స్తంభాలు – 2133 స్తంభాలు – రూ. 74.99 లక్షలు.
జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ –107 లేఅవుట్స్, రూ. 18.42 కోట్లు.
సేఫ్టీ వర్కులు – రూ. 21.63 లక్షలు.

ప్రారంభించాల్సిన పనులు

విద్యుత్ సబ్ స్టేషన్లు – అయితంపూడి, ఆరవల్లి – రూ. 7.22 కోట్లు.
పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపుదల – రూ. 5.97 కోట్లు.
అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ – రూ. 90 లక్షలు.
33కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్ – రూ. 50.45 లక్షలు.
11కేవీ అగ్రికల్చర్ లైన్స్ శాగ్రిగేషన్ – గోటేరు ఫీడర్, రూ. 50 లక్షలు.
ట్రాన్స్‌ఫార్మర్స్ – 321, రూ. 11.63 కోట్లు.
విద్యుత్ స్తంభాలు – 835, రూ. 50.50 లక్షలు.

విద్యుత్ సమస్యలను అధిగమించాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యుత్ శాఖలో నూతన ఆవిష్కరణలు తీసుకు వచ్చారు. అదే స్ఫూర్తితో తణుకు నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు సంబంధించి మిగిలిన నియోజకవర్గాల కన్నా అధిక సంఖ్యలో నిధులు తీసుకువచ్చాం. విద్యుత్ సరఫరాలోను అభివృద్ధి విషయంలోను తణుకు నియోజకవర్గానికి పెద్దపీట వేశాం. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో విద్యుత్ అవసరాలకు అత్యధికంగా రూ. 18.42 కోట్లు నిధులు ఖర్చుచేశాం. అంతేకాకుండా విద్యుత్ రంగంలో సంక్షేమానికి సైతం అధికప్రాధాన్యతనిస్తూ ఆక్వా, వ్యవసాయం, ఎస్సీ, ఎస్టీ అంశాల్లో రూ. 68.18 కోట్లు సంక్షేమం రూపంలో విద్యుత్ రాయితీలు అందజేశాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

నాణ్యమైన విద్యుత్ సేవలందిస్తున్నాం



విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, మంత్రి కారుమూరి సూచనలతో విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ శాఖ ద్వారా తణుకు నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సేవలు అందజేశాం. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఎక్కడా కూడా విద్యుత్ సరఫరాలోను, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ విషయంలో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో ప్రభుత్వం సైతం విద్యుత్ అదనపు కొనుగోళ్లు చేసి విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగింది. రానున్న వేసవిని కూడా దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– సీహెచ్ రామకృష్ణ, విద్యుత్ శాఖ డీఈఈ, తణుకు –

రూ. 5.67 కోట్లతో సబ్ స్టేషన్స్ నిర్మించారు



తణుకు పట్టణం, మండలంలోని మండపాక గ్రామంలో రూ. 5.67 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్య తప్పింది. దీంతో విద్యుత్ గృహ అవసరాలకు, రైతాంగానికి ఎలాంటి లోఓల్టేజీ సమస్య రాదు. లోఓల్టేజీ సమస్యను అధిగమించే క్రమంలో సబ్ స్టేషన్స్ ఏర్పాటుకు మంత్రి కారుమూరి ఎంతగానో కృషి చేశారు.

– బోడపాటి వీర్రాజు, వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు

విద్యుత్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



విద్యుత్ సంక్షేమంలో భాగంగా ఆక్వా రైతాంగానికి, ఎస్సీ, ఎస్టీ, వ్యవసాయ రంగాలకు తణుకు నియోజకవర్గంలో రూ. 68.18 కోట్లు సంక్షేమం రూపంలో ప్రభుత్వం రాయితీ ఇవ్వడాన్ని రైతాంగం, ఎస్సీఎస్టీ సోదరులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రాకుండా ఉండేందుకు అత్తిలి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్స్ నూతనంగా ఏర్పాటు చేశారు.

– పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్



ఇరగవరం మండలంలో గతంలో కొన్నిగ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తీవ్రంగాఉండేది. మంత్రి కారుమూరి సహకారంతో నూత నంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్స్‌తో సమస్య చాలా వరకు తగ్గింది. రానున్నరోజుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ మండలంలో నిర్మా ణం చేసేందుకు మంత్రి కారుమూరి చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సైతం గత వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించారు.

– కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పు

- విద్యార్థులను ఎంతవరకైనా చదివించడానికి సీఎం సిద్ధం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



నందమూరు గ్రామంలో సకల జన సమ్మేళన పాదయాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని నందమూరు గ్రామంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఎంత వరకు చదవాలంటే అంత వరకు చదివించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విద్యావిధానం అమలులోకి వచ్చిందన్నారు. తద్వారా విద్యార్థులు పదో తరగతికి వచ్చేసరికి ఆంగ్లంతో మాట్లాడే స్థాయికి ఎదుగుతారన్నారు. ఇప్పటి వరకు కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించే వారన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం చేసుకుంటున్న ఎంవోయుల ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌లు జగన్‌ను అధికారం నుంచి దించేసి తాము అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. వారికి అధికారం కట్టబెట్టేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరిట ప్రజల్ని దోచేసే వారన్నారు. నేడు జగన్ పాలనలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆ ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ఒకానొక సందర్భంలో వలంటీర్లను విమెన్ ట్రాఫకర్లుగా పవన్ వ్యాఖ్యలు చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే రెండు నెలల కాలంలో దుర్మార్గులు ప్రతి ఇంటికి వస్తారని, ప్రజలు మంచి ఆలోచన చేసి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. పేదలకు, పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్పీటీసీలు వీర్లపాటి జ్యోతి, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, డైరెక్టర్లు మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, చిట్టూరి బాపన్న, నాయకులు కోనేటి దానయ్య, యామని సత్యనారాయణ, శ్రీరాములు వెంకటేశ్వరరావు, వీర్లపాటి సత్యనారాయణ, కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, గెద్దం మోషే, సరిపల్లి కృష్ణంరాజు, కల్లేపల్లి కృష్ణంరాజు, గొర్ప్పిపూడి సీతారాములు, అడపా అప్పలరాజు, దాకే పండియ్య, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, హౌసింగ్ ఏఈ వైకేవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, సచివాలయ సెక్రటరీ, ఆకుల మణికంఠేశ్వరి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలంతా జగన్ వెంటే..



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

తణుకు టౌన్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలందరూ ఉన్నారని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీ సురేష్ కోరారు. తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం, మన కారుమూరిని గెలిపిద్దాం అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ అధ్యక్షత వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నామినేటెడ్ పదవులలో కూడా ఎస్సీలకు పదవులు కల్పించి గౌరవించారని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు, జమీందారీ కుటుంబాలకే పరిమితమైన రాజ్యసభ ఎంపీ పదవులతో పాటు మంత్రి పదవులను కూడా ఎస్సీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పీ దొరబాబు, నక్కా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



జలజీవన్ మిషన్ పనులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేస్తున్న సెంట్రల్ వాష్ ఎక్స్‌పర్ట్స్ బృంద సభ్యులు

అత్తిలి: స్కిన్నెరపురం గ్రామ పంచాయతీ వద్ద చేపట్టిన జలజీవన్‌మిషన్ పనులను, వాటికి సంబంధించిన రిజిష్టర్లను ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ వాష్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ బృందం సోమవారం పరిశీలించింది. గ్రామ నీటి పారిశుద్ధ్య కమిటీ సభ్యులను, గ్రామ ప్రజలను బృందం సభ్యులు కలుసుకుని గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును బృందం సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తమ్మాబత్తుల సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎం శ్రీనివాసరావు, జలజీవన్‌మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎ రామస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హరిమోహన్, కార్యదర్శి జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

కేశవస్వామి ఆలయంలో నూతన నిర్మాణాలు ప్రారంభించిన మంత్రి కారుమూరి



తణుకు కేశవస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు శ్రీకేశవస్వామి ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించిన ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అభినందనీయులని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు శ్రీకేశవస్వామి ఆలయ ఆవరణలో చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు రూ. 5 లక్షల సొంత నిధులతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణాలను మంత్రి కారుమూరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశవస్వామి ఆలయంలో ముహూర్తాల సమయంలో అధికసంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయని, వివాహాలకు వచ్చే ఇరు పక్షాలకు అవసరమైన వసతులు కల్పించడం శుభపరిణామమన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన మంత్రి కారుమూరిని ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, అర్చక బృందం ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి (అబ్బు), పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పిల్లి సూరిబాబు, గుబ్బల సూర్యచంద్రరావు, చేశెట్టి లలితా శంకర్, ఉండ్రాజవరపు గీత, కుడుపూడి చంద్రరావు, తాడిపర్తి వాసు, సామంతుల అప్పారావు, సంగిరెడ్డి శ్రీనివాస్, అవినాష్, నారాయణ అప్పారావు, గోడి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని దయతో మళ్లీ సీఎంగా జగన్

ఇరగవరం: హనుమద్, శ్రీరాముని దయతో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలుస్తారని రాష్ట్ర పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఇరగవరంలో జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కొత్తపాడు గ్రామంలో నిర్వహించిన శ్రీ హనుమద్ లక్ష్మణ సీత సమేత శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఆ రాములు వారి దయతో రాష్ట్రంలో సుభిక్ష పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆ రాముల వారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం రామాలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తుల, అగ్ని మాపక సర్వీసుల డీజీ పీవీ సునీల్ కుమార్, పంచముఖి ఆంజనేయ పీఠాధిపతి తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు, ఎంపీటీసీలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



పెంటపాడులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పార్టీ నాయకులు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు నుంచి దర్శిపర్రు, వల్లూరి పల్లి, రాచర్ల మీదుగా అలంపురం జాతీయ రహదారిని కలుపుతూ ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతు పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామీణ రోడ్లుతో పాటు ఆర్అండ్‌బి జాతీయ రహదార్లకు మోక్షం కలుగుతుందన్నారు. రోడ్లు గుంతలని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. వందశాతం అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్న సంగతిని ప్రజలు గమనించాలన్నారు. పనులు వేగంగా జరగాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో వేస్తున్న ఈ రోడ్డు నిర్మాహణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట నీరిక్షనరావు, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు గుండుమోగుల మునీంద్ర, అర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా జవ్వాది శ్రీను

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ 31వ వార్షికోత్సవం సోమవారం మార్కెట్‌లో జరిగింది. నూతన కార్యవర్గంను ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా జవ్వాది శ్రీను, ఉపాధ్యక్షుడిగా టి.పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా కాయల దుర్గా ప్రసాద్, జాయింట్ కార్యదర్శి సారికి శ్రీను, కోశాధికారి పుట్టా యేసు, కమాండర్ మద్దూరి ఆనంద్, కమిటీ సభ్యులుగా సుంకర శ్రీను, సువ్వాడ రాంపండు, బాసింశెట్టి శ్రీనులు ఎన్నికయ్యారు. తొలుత జట్టు వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు పి.సన్యాసిరావు, మరో నాయకుడు టి.పెద్దిరాజుల సంతాప సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, గొర్రెల వంశీ, జి.నాగేశ్వరరావు, కర్రెడ్ల రామకృష్ణ, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఉద్యోగులకు ప్రయోజనం

భీమవరం: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్ఐ)తో ఉద్యోగులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీస్ టి.సుబ్రహ్మణ్యం చెప్పారు. సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సిబ్బందికి నిర్వహించిన పీఎల్ఐ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎల్ఐ పథకంలో బోనస్ ఎక్కువగా ఉండటమే కాకుండా కట్టాల్సిన నగదులో కూడా చివరి దశకు వచ్చేసరికి కొంత తగ్గింపు కూడా ఉంటుందన్నారు. దీనిలో ఉద్యోగులకు అనువైన ఎండోమెంట్ ఇన్సూరెన్స్, హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ఎన్నో స్కీమ్స్ ఉంటాయన్నారు. ఐపీపీబీ మేనేజర్ బీఎస్ కళ్యాణ్ మాట్లాడుతూ ఐపీపీబీ స్కీంలో చేరితే యాక్సిడెంట్ బెనిఫిట్స్‌తో పాటు హెల్త్ స్కీమ్స్, వెల్ఫేర్ ఫ్రీ చెకప్ తదితర సదుపాయాలన్నీ ఉంటాయన్నారు.